సాక్షి ప్రకాశం

శనివారం । 2 । డిసెంబర్ । 2023



ఎయిడ్స్ నిర్మూలనకు చర్యలు

ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు.

- 8లో..



మాది అభివృద్ధి..సంక్షేమ ప్రభుత్వం

తమది అభివృద్ధి. సంక్షేమ ప్రభుత్వమని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. వై నీడ్స్ ఏపీ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
31/24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

బ్యాక్‌లాగ్ పోస్టుల మెరిట్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

ఒంగోలు సెంట్రల్: 2021–22 సంవత్సర దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల సాధారణ మెరిట్ జాబితాపై అభ్యంతరాలను పూర్తి ఆధారాలతో తెలపాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జీ అర్చన తెలిపారు. ప్రత్యేక ఉద్యోగాల నియామక ప్రక్రియలో భాగంగా అభ్యంతరాల స్వీకరణ కోసం గ్రూప్–4, క్లాసు–4 పోస్టుల సాధారణ మెరిట్ జాబితాను అభ్యర్థుల పరిశీలనకు వెబ్‌సైట్ ''www.prakasam.ap.gov.in/notice_category/recruitment''లో ఉంచినట్లు చెప్పారు. అభ్యర్థులు వెబ్ సైట్‌ను ఈనెల 2 నుంచి 8వ తేదీ లోపు పరిశీలించి అభ్యంతరాలుంటే పూర్తి ఆధారాలతో నిర్ణీత సమయంలో తెలియజేయాలని కోరారు. సందేహ నివృత్తి కోసం 08592–281310 నంబర్‌ను కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని వివరించారు.

రేషన్ పంపిణీ తనిఖీ చేసిన జేసీ శ్రీనివాసులు



రేషన్ పంపిణీ ప్రక్రియను ఎండీయూ వాహనం వద్ద తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: స్థానిక కేశవస్వామి పేటలో పంపిణీ చేస్తున్న రేషన్ వాహనాన్ని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎండీయూ వాహనం ఆపరేటర్, వలంటీర్, వీఆర్‌ఓలతో పాటు కార్డుదారులను రేషన్ పంపిణీపై ఆరా తీశారు. ప్రతి కార్డుదారునికి రేషన్ సరుకులు పక్కాగా అందజేయాలని సూచించారు. దీనిలో డీఎస్‌ఓ ఉదయభాస్కర్, ఒంగోలు తహశీల్దార్ మురళి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పూతకోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజే 75.56 శాతం సామాజిక పెన్షన్ల పంపిణీ



ఏడుగుండ్లపాడు గ్రామంలో పెన్షన్ పంపిణీ చేస్తున్న డీఆర్డీఏ పీడీ రవికుమార్

ఒంగోలు టౌన్/మద్దిపాడు: జిల్లాలో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వివిధ చేతివృత్తిదారులకు సంబంధించి పింఛన్ల పంపిణీ శుక్రవారం సాయంత్రం 7 గంటలకు 75.56 శాతం పూర్తయింది. 2,93,046 మంది పెన్షన్ లబ్ధిదారులకు రూ.81.48 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం నవంబరు చివరి నాటికే విడుదల చేసింది. ఈ నిధులను నేరుగా జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల ఖాతలకు జమ చేసింది. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా పెన్షన్ల పంపిణీ జరుగుతోంది. మద్దిపాడు మండలంలోని ఏడుగుండ్లపాడు గ్రామంలో పెన్షన్ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ తేళ్ల రవికుమార్ పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్ అందజేశారు. లబ్ధిదారుల ఇంటి వద్దే పంపిణీ జరిగేలా చూడాలని, 100 శాతం పెన్షన్లు పంపిణీ చేయాలని సచివాలయ సిబ్బందికి ఆయన సూచించారు.

3న హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

ఒంగోలు: హ్యాండ్‌బాల్ సబ్ జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక ఈనెల 3న స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి పి.విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికకు 2008 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారు మాత్రమే అర్హులు. ఎంపికకు వచ్చేవారు తమ వెంట వయస్సు ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలన్నారు.

పీజీ సెల్ఫ్ సపోర్టు కోర్సుల ప్రవేశాలకు అవకాశం

ఒంగోలు: స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన పలు పోస్టు గ్రాడ్యుయేషన్ సెల్ఫ్ సపోర్టు కోర్సులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు అడ్మిషన్స్ విభాగం సంచాలకుడు డాక్టర్ జి.సోమశేఖర తెలిపారు. ఎంఎస్‌సీ కంప్యూటర్ సైన్స్, ఎంఎస్‌సీ ఆక్వాకల్చర్, ఎంఎస్‌సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లలో ప్రవేశాలకు అవకాశం కల్పిస్తారన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు పీజీ అడ్మిషన్స్ కార్యాలయాన్ని సెల్ నంబర్లు 6304343448, 8978496178లలో సంప్రదించాలన్నారు.

సహకారం.. దశ తిరిగే



యర్రగొండపాలెంలో ఏర్పాటు చేసిన పెట్రోలు బంకు

సహకార రంగాన్ని గత తెలుగుదేశం ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఈ రంగం దశ తిరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకార రంగాన్ని బలోపేతం చేసి వాటి తలరాతను మార్చేశారు. సహకార పరపతి కేంద్రాల ద్వారా పలు రకాల సేవలు రైతులకు, ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. జిల్లాలో జనరిక్ మందుల షాపులు, పెట్రోల్ బంకుల ఏర్పాటు, ఆధార్‌లో మార్పులు, చేర్పులు పాన్‌కార్డు, అలాగే 1బీ, అడంగల్ సర్టిఫికెట్లు ఇలా వివిధ రకాల సేవలు అందిస్తూ సేవలను విస్తృతం చేశారు.

- సహకార సంఘాల్లో బహుళ సేవలు
- జిల్లాలో 12 జనరిక్ ఔషధ కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు
- ఏడు పెట్రోల్ బంకులకుగానూ రెండు బంకుల ఏర్పాటు
- ప్రతి సహకార పరపతి సంఘంలో కామన్ సర్వీస్ సెంటర్
- అందుబాటులోకి 250 రకాల సేవలు

ఒంగోలు సిటీ: ఒకప్పుడు పరిమిత సేవలందించే సహకార సంఘాలు నేడు రైతుల అవసరాలు, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వాణిజ్య సరళిలో తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరింపజేస్తున్నాయి. బహుళ సేవలను సహకార పరపతి కేంద్రాల్లోనే అందుబాటులోకి తీసుకువచ్చాయి. అందులో భాగంగా జిల్లాలో 12 జనరిక్ ఔషధ కేంద్రాలు, ఏడు పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే రెండు పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయగా, మరో ఐదు బంకులు త్వరలో అందుబాటులోకి రానున్నాయి.

జనరిక్ ఔషధ కేంద్రాలు..

ప్రధానమంత్రి జనరిక్ ఔషధ కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తోంది. వీటిని గ్రామీణ ప్రాంతాల్లో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా తొలివిడతగా జిల్లాలో 12 సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్)ను ఎంపిక చేసింది. త్వరలో వీటిని అందుబాటులోకి తీసుకురానుంది.

అందుబాటులోకి 250 రకాల సేవలు..

సహకార పరపతి సంఘాల్లో కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్‌సీ) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. గతంలో రైతులు, ప్రజలకు ఏదైనా సర్టిఫికెట్ 1బీ, అడంగల్, ఆధార్‌లో మార్పులు, చేర్పులు పాన్‌కార్డు వంటి తదితర సేవలు కావాలంటే మీ సేవ కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో మీ సేవ నిర్వాహకులు అధిక ధరలు వసూలు చేసి దోపిడీకి పాల్పడేవారు. వీటికి చెక్‌పెట్టేలా ప్రతి సహకార పరపతి సంఘంలో కామన్‌సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేసి 250 రకాల సేవలను అందిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 172 సహకార పరపతి సంఘాలు ఉండగా, ఇప్పటికే 168 కేంద్రాల్లో కామన్ సర్వీస్ సెంటర్లు అందుబాటులోకి తీసుకొచ్చింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సూపర్‌బజార్లు, టెంట్ హౌస్‌లు, క్లాత్ బిజినెస్ నిర్వహిస్తోంది. గోడౌన్లు, బిల్డింగ్‌ల నిర్మాణానికి సంబంధించి పావులూరులో గోడౌన్, బిల్డింగ్ పనులను పూర్తి చేశారు. గుర్రపుశాల, బూదవాడ, సజ్జాపురం గ్రామాల్లో గోడౌన్లు, బిల్డింగ్ పనులు జరుగుతున్నాయి.



అడుసుమల్లి పెట్రోల్ బంకులో వాహనదారునికి పెట్రోల్ కొడుతున్న పీడీసీసీబీ చైర్మన్ వై.ఎం.ప్రసాద్‌రెడ్డి (ఫైల్)

పెట్రోల్ బంకుల నిర్వహణ

ఆర్థికంగా బలోపేతానికి జిల్లా సహకారశాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకుల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో 7 పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించింది. ఇప్పటికే అడుసుమల్లి (పర్చూరు మండలం), చెరుకూరు(యర్రగొండపాలెం మండలం) లో పెట్రోల్ బంకులను నిర్వహిస్తోంది. మరో ఐదు పెట్రోల్ బంకులను ఇంకొల్లు, పావులూరు, భీమవరం, నూతలపాడు, పామూరులలో ఏర్పాటు చేసేందుకు పనులు జరుగుతున్నాయి.

సహకార రంగాన్ని సీఎం జగన్ బలోపేతం చేస్తున్నారు



సహకార రంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. సహకార రంగ అభివృద్ధి వలన గ్రామీణ ప్రాంతాల్లోని వారికి ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. పంట ఉత్పత్తులపై ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నాం. సహకార రంగ సేవలు గ్రామీణ ప్రాంతాల వారికి మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యం.

– వై.ఎం.ప్రసాద్‌రెడ్డి, పీడీసీసీబీ చైర్మన్

రైతును రాజుగా చేసిన జగనన్న



రైతులకు పట్టాలు పంపిణీ చేస్తున్న పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్
- రైతులకు భూ యాజమాన్య హక్కు పత్రాలు, అసైన్‌మెంట్ పట్టాలు, ఫ్రీ హోల్డ్ అసైన్‌మెంట్ పట్టాల పంపిణీ

యర్రగొండపాలెం: రైతుల కోసం అనునిత్యం తపన పడుతూ.. వారికి చిన్న కష్టమొచ్చినా అక్కున చేర్చుకొని రైతులను రారాజుగా, వాళ్ల కాళ్లపై వాళ్లు నిలబడేలా తీర్చిదిద్దిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కొనియాడారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి భూ యాజమాన్య హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ తరుణంలో వైఎస్సార్ 2004లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఐదేళ్లలో 6 విడతలుగా 30 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని పేద రైతులకు పంపిణీ చేశారని, ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి రెండు అడుగులు ముందుకేసి తన నాలుగున్నర సంవత్సరాల్లో 28 లక్షల ఎకరాలను భూ పంపిణీ చేశారని అన్నారు. 2019లో జరిగిన ఎన్నికల ముందు జగనన్న తాను చేసిన సుదూర పాదయాత్రలో రైతుల కష్టాలు తెలుసుకున్నారని చెప్పారు. తాము తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూమిపై హక్కులేకుండా పోయిందని రైతులు ఆయన దృష్టికి తీసుకొని వెళ్లగా.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులను ఆదుకుంటానని చెప్పిన మాట ప్రకారం ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని అన్నారు. వ్యవసాయం దండగ అని టీడీపీ నాయకుడు చంద్రబాబునాయుడు తన పదవీ కాలంలో రైతులను పూర్తిగా విస్మరించారని, ఫలితంగా అనేక మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని విమర్శించారు. ఎన్నికలు సమీపించే కొద్ది పచ్చనేతలకు ఎక్కడాలేని మోసపు మాటలు జ్ఞాపకం వస్తాయని, రైతులకు రుణమాఫీ చేస్తామని, భూ పంపిణీ చేస్తామని వాగ్దానాలు చేసి అధికారంలోకి వస్తారని, ఆ తరువాత వారిచ్చిన వాగ్దానాలను విస్మరిస్తారని అన్నారు. చంద్రబాబు చేసిన మోసాన్ని గుర్తుపెట్టుకున్న రైతులు 2019లో టీడీపీని అడ్రస్ లేకుండా చేశారని చెప్పారు.

పచ్చనేతది ఓటు బ్యాంకుగా చూసే మనస్తత్వం

నారా చంద్రబాబు నాయుడుది బడుగు, బలహీన, పేదవర్గాలను ఓటు బ్యాంకుగా చూసే మనస్తత్వమని మంత్రి విమర్శించారు. సినిమా చూపే మనిషి (పవన్‌కల్యాణ్) ఒక పక్క చంద్రబాబుకు గ్యారంటీ అంటా.. చంద్రబాబునాయుడు మనకు ష్యూరిటీ అంటా అని మంత్రి వ్యంగ్యంగా అన్నారు. అనంతరం నియోజకవర్గంలోని 103 మందికి 138.23 ఎకరాల అసైన్‌మెంట్ పట్టాలు, 629 మందికి 1263.76 ఎకరాలకు ఫ్రీ హోల్డ్ అసైన్‌మెంట్ (20 ఏళ్ల అనుభవంలో ఉన్న) పట్టాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీలు దొంతా కిరణ్‌గౌడ్, కందుల వెంకటయ్య, కోట్ల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు చేదూరి విజయభాస్కర్, యేర్వ చలమారెడ్డి, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు కె.ఓబులరెడ్డి, జి.రమణారెడ్డి, ఎస్.పోలిరెడ్డి, జిల్లాపరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మేడగం వెంకటరెడ్డి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, ఏఎంసీ వైస్ చైర్మన్ కె.జయరావు, సర్పంచ్‌లు అరుణాబాయి, సుబ్బారెడ్డి, ఏకుల ముసలారెడ్డి, తహసీల్దార్లు కె.రవీంద్రరెడ్డి, కె.దాస్, కృష్ణారెడ్డి, వి.కిరణ్, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో సుబ్బరామరెడ్డిది చెరగని స్థానం



వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే టీజేఆర్, మేయర్ గంగాడ



మాగుంట సుబ్బరామరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు, రాఘవరెడ్డి

- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతి సందర్భంగా ఘన నివాళి

ఒంగోలు: జిల్లా ప్రజల హృదయాల్లో మాగుంట సుబ్బరామరెడ్డి చెరగని స్థానం సంపాదించుకున్నారని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మాగుంట కుటుంబీకులు, మాగుంట అభిమానులు నిర్వహించిన మాగుంట సుబ్బరామరెడ్డి 28వ వర్ధంతి కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, అభిమానులు పాల్గొని సుబ్బరామరెడ్డి చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు. సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ 1991లో జిల్లాలో మాగుంట సుబ్బరామరెడ్డి రాజకీయాన్ని ప్రారంభించారని, తనతోపాటు అనేకమంది ఆయన శిష్యులం అని చెప్పారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు వాటర్ ట్యాంకుల ఏర్పాటు, వెనుకబాటును రూపుమాపేందుకు విద్యాసంస్థలను నెలకొల్పి ప్రజల దృష్టిలో మహనీయునిగా నిలిచారన్నారు. తనతోపాటు ఎంతోమంది యువకులను రాజకీయాల్లోకి ప్రోత్సహించారన్నారు. మాగుంట, తన కాంబినేషన్ విజయానికి చిహ్నం అని, ఈ దఫా కూడా తప్పకుండా విజయఢంకా మోగిస్తామని చెప్పారు. 28 సంవత్సరాలుగా ఇదే మైదానంలో ప్రతి ఏటా సంస్మరణ సభ, అన్నదాన కార్యక్రమం నిర్వహించుకోవడం మాగుంట కుటుంబానికే చెల్లిందన్నారు. ఆయన వారసత్వంగా మాగుంట శ్రీనివాసులురెడ్డి, వారి కుటుంబ సభ్యులు సుబ్బరామరెడ్డి ఆశయాలు కొనసాగిస్తూ ఉన్నారని, యువనాయకుడు మాగుంట రాఘవరెడ్డిని కూడా ప్రజలు ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు.

కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఎంపీ మాగుంట సుబ్బరామరెడ్డి పార్లమెంట్ సభ్యునిగా చేసిన సేవలు ఆయన గొప్ప మనస్సుకు నిదర్శనమన్నారు. ఇటువంటి వారు జీవితాంతం ప్రజల హృదయాల్లోనే ఉండిపోతారన్నారు. ఎస్పీ మలికాగర్గ్ మాట్లాడుతూ అనుకోని ఘటనలో దివంగత పార్లమెంట్ సభ్యుడు మాగుంట సుబ్బరామరెడ్డితోపాటు ఆయన గన్‌మెన్ రత్నం ప్రాణాలు కోల్పోయారన్నారు. నాడు నక్సల్స్ ప్రభావం ఎక్కువగా ఉండేదని, అయితే పోలీసుశాఖ తీసుకున్న ప్రత్యేక చర్యలు వల్ల నేడు నక్సలిజం ప్రభావాన్ని గణనీయంగా తగ్గించి ప్రశాంత పరిస్థితులు నెలకొల్పినట్లు చెప్పారు. మాగుంట సుబ్బరామరెడ్డి, గన్‌మెన్ రత్నంల ఆత్మలకు శాంతి కలగాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నామన్నారు.

ఎమ్మెల్సీ పోతుల సునీత, ఎమ్మెల్యేలు టీజేఆర్ సుధాకర్‌బాబు, కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ పేదల కష్టాలను స్వయంగా గమనిస్తూ వారిని అభివృద్ధి పథకంలోకి తీసుకెళ్లాలనే దృఢ సంకల్పంతోనే విద్యా సంస్థలు నెలకొల్పారని, అపర భగీరథునిలా మంచినీటి ట్యాంకులు ఏర్పాటు చేశారని సుబ్బరామరెడ్డి సేవలను కొనియాడారు. రాష్ట్ర మార్కెటింగ్, సహకార శాఖల ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ మాగుంట సుబ్బరామరెడ్డితో తమకు ఉన్న అనుబంధాన్ని వివరించారు. సొంత ధనాన్ని వెచ్చించి ఆదుకోవడంతోపాటు వెనుకబడిన ప్రకాశం జిల్లాలో విద్యాభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దంపతులు, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, నగర మేయర్ గంగాడ సుజాత తదితరులు మాగుంట కుటుంబీకులతో కలిసి స్వయంగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ ప్రసాదరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బూచేపల్లి శివప్రసాదరెడ్డి, కసుకుర్తి ఆదెన్న, ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఈదర హరిబాబు, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు బాలినేని ప్రణీత్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసు వెంకయ్య, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, ఒడా చైర్‌పర్సన్ సింగరాజు మీనాకుమారి, డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, ఏఎంసీ మాజీ చైర్మన్ అయినాబత్తిన ఘనశ్యాం, తాతా ప్రసాద్, చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి శంకర్, గోలి తిరుపతిరావు, బెల్లం సత్యన్నారాయణ, కుప్పా రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా మాగుంట విద్యా సంస్థల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అతిథుల చేతులమీదుగా పంపిణీ చేశారు. మాగుంట సేవలపై నిర్వహించిన కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను ఆయన సత్కరించారు.

ఏసీబీకి వలలో ఇద్దరు వీఆర్వోలు



వల్లూరి శ్రీనివాసరావు, ఏసీబీ డీఎస్పీ



ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఇద్దరు వీఆర్వోలు

చీమకుర్తి: దివ్యాంగుడైన ఓ రైతు పొలాన్ని ఆన్‌లైన్ చేసేందుకు డబ్బులు డిమాండ్ చేసిన వ్యవహారంలో ఇద్దరు వీఆర్వోలను ఏసీబీ అధికారులు అదుపులోనికి తీసుకున్నారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... చంద్రపాడు గ్రామానికి చెందిన కోటు శ్రీనివాసరావు, సోదరుడు అంకమ్మరావు, తల్లి రమణమ్మకు చెందిన భూమిని ఆన్‌లైన్ చేయమని దాదాపు రెండు నెలల నుంచి చంద్రపాడు సచివాలయం వద్ద వీఆర్వో వద్దకు తిరుగుతున్నారు. చంద్రపాడు సచివాలయంలో వీఆర్వో పోస్టు ఖాళీగా ఉండటంతో పల్లామల్లిలో వీఆర్‌ఓగా పనిచేస్తున్న వీఆర్వో మార్నెళ్ల వెంకట వీరనారాయణ ఇక్కడ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. గ్రామానికి చెందిన దివ్యాంగుడు కోటు శ్రీనివాసరావు పొలం 2.27 ఎకరాలు, అంకమ్మరావు పొలం 2.10 ఎకరాలు, తల్లి రమణమ్మ పొలం 0.85 ఎకరాలను ఆన్‌లైన్ చేసేందుకు వీఆర్వో వెంకట వీరనారాయణ రూ.30 వేలు డిమాండ్ చేశాడు. రూ.10 వేలు ఇస్తానంటే కుదరదన్నాడు. సరేనని బేరం మాట్లాడుకొని రూ.20 వేలకు కుదుర్చుకున్నాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని పొలం యజమాని కోటు శ్రీనివాసరావు, ఆయన తల్లి రమణమ్మ కలిసి ఒంగోలు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారిచ్చిన సూచనల మేరకు ఫిర్యాదుదారుడు కోటు శ్రీనివాసరావు వీఆర్వోకు ఫోన్ చేసి డబ్బులు తెచ్చాను ఎక్కడున్నారని అడిగారు. తాను పల్లామల్లి సచివాలయంలో ఉన్నానని, ఎల్లో కలర్ డ్రస్సు వేసుకున్న ఒక మహిళ వస్తుందని, ఆమెకు రూ.20 వేలు ఇవ్వాలని వీఆర్వో వెంకట వీరనారాయణ ఫిర్యాదుదారుడికి ఫోన్‌లో చెప్పారు. చెప్పిన ప్రకారం ఎల్లో కలర్ డ్రస్సు వేసుకున్న మహిళ రెవెన్యూ కార్యాలయం వద్దకు వచ్చి బహిరంగంగానే ఫిర్యాదుదారుడు ఇచ్చిన రూ.20 వేలను తీసుకుంది. వెంటనే ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఆమె కూడా చీమకుర్తి మున్సిపాలిటీలోని 4వ సచివాలయం వీఆర్వో సౌజన్యగా తెలిసింది. ఇద్దరు వీఆర్వోలు ఫోన్‌లో మాట్లాడుకున్న సమాచారాన్ని ఏసీబీ డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్‌లు ధ్రువీకరించుకున్నారు. ఇంతలో పోలీసులతో పల్లామల్లి సచివాలయం వద్దకు పంపించి వీఆర్వో వెంకట వీరనారాయణను కూడా అదుపులోకి తీసుకున్నారు. వారిని శనివారం నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు డీఎస్పీ వల్లూరి శ్రీనివాసరావు తెలిపారు.

మొరాయించిన సర్వర్లు

- నిలిచిన స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు
- జిల్లా వ్యాప్తంగా 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ...

ఒంగోలు సబర్బన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో సర్వర్లు మొరాయించటంతో స్థిరాస్తి క్రయ విక్రయదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఆ శాఖ రాష్ట్ర కేంద్ర కార్యాలయంలోనే సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా లావాదేవీలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు స్థిరాస్తి రిజిస్ట్రేషన్ ప్రక్రియకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. స్థిరాస్తి క్రయ విక్రయాలు పూర్తి చేసుకొని డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కోసం వచ్చి వారు నిరాశతో వెనుతిరగాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా కార్డ్ 2.0 ప్రైమ్ విధానాన్ని గత నెల 28వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసింది. నేరుగా ఆన్‌లైన్ ద్వారానే ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నూతన విధానాన్ని తీసుకొచ్చే అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ట్రయల్ చెక్ కింద కొన్ని కార్డ్ 2.0 ప్రైమ్ పద్ధతిలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేపట్టారు. పూర్తి స్థాయిలో నూతన విధానం ద్వారానే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను చేయవచ్చని రాష్ట్ర ఉన్నతాధికారులు నిర్ణయించిన తరువాత మాత్రమే రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి వచ్చింది. అయితే సర్వర్లలో సాంకేతిక లోపం ఏర్పడి సర్వర్లు మొరాయించాయని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. శనివారానికి మొత్తం సాంకేతిక లోపాన్ని సవరించటం ద్వారా యథావిధిగా స్థిరాస్తి రిజిస్ట్రేషన్ ప్రక్రియకు మార్గం సుగమం అవుతుందని భావిస్తున్నారు. ఒక్క రోజులో దాదాపు 15 వేలకు పైగా స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు ఆగిపోయి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఒక్క ప్రకాశం జిల్లాలోనే దాదాపు 400 నుంచి 600 వరకు డాక్యుమెంట్లు ఆగిపోయాయి. అన్ని రకాలుగా రూ.కోటి వరకు ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం నిలిచిపోయినట్లయింది.

బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

ఒంగోలు అర్బన్: ఓటర్ల జాబితా సవరణ కోసం ఈ నెల 2, 3 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్న నేపథ్యంలో బీఎల్‌వోలు తప్పనిసరిగా వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించిన విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం జిల్లా కలెక్టర్‌లతో వీడియో సమావేశం నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు పాల్గొన్నారు. దీనిలో జిల్లాలోని పరిస్థితులను కలెక్టర్ సీఈఓకు వివరించారు. ప్రత్యేక క్యాంపులకు బీఎల్‌ఓలు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అక్టోబర్ 27వ తేదీ విడుదలైన ముసాయిదా ఓటర్ల జాబితాలో జిల్లాలో 18 ఏళ్లు నిండిన వారు 14 వేల మంది ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 24 వేలకు పెరిగిందన్నారు. జిల్లాలో పూర్తి స్థాయిలో 301 మందిని సెక్టార్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. జిల్లాకు 1.71 లక్షల ఎపిక్ కార్డులు చెన్నై నుంచి ప్రింట్ అయ్యి రావాల్సి ఉందన్నారు. జిల్లాలో అనామలీస్ వెరిఫికేషన్ మరో 500 ఇళ్లు, 1387 ఓట్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. అయితే ఈ నెల 5వ తేదీలోపు వాటిని పూర్తి చేస్తామని, అనామలీస్‌పై జాయింట్ కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఈఓ చెప్పారు. దీనిలో జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గిరిజన యువతకు గ్రూప్‌-2 పరీక్షకు ఉచిత కోచింగ్‌

ఒంగోలు సెంట్రల్‌: ఆంధ్రప్రదేశ్‌ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ గిరిజన యువతకు తిరుపతి పట్టణంలోని ప్రముఖ కోచింగ్‌ కేంద్రంలో గ్రూప్‌–2 పరీక్షకు ఉచిత కోచింగ్‌ ఇవ్వనున్నట్లు ఆ శాఖ జిల్లా సంక్షేమ అధికారి పి.జగన్నాథరావు తెలిపారు. జిల్లాలో ఎదైనా డిగ్రీ అర్హత కలిగిన యువత ఈ నెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. కోచింగ్‌ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటుందన్నారు. అర్హత కలిగిన యువతీ యువకులు విద్యార్హత, కుల ధ్రువీకరణ, ఆధార్‌ జెరాక్స్‌ పత్రాలు జతపరచిన దరఖాస్తులను జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి కార్యాలయానికి చేర్చాలని సూచించారు. పూర్తి వివరాలకు బాలాజీ, వైటీసీ సెంటర్‌ మేనేజర్‌ (8187899877)ను సంప్రదించాలని కోరారు.

ఒంగోలులో ఉచిత న్యాయ సలహా కేంద్రం

ఒంగోలు సిటీ: చట్ట పరిధిలోని సమస్యల పరిష్కారానికి ఒంగోలులో ఉచిత న్యాయ సలహా కేంద్రం ఏర్పాటు చేసినట్లు ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాచార హక్కు చట్టం ద్వారా సేవలు, లోకాయుక్తకు ఫిర్యాదులు, పోలీసు కేసులకు సంబంధించిన సలహాలకు ఉచిత న్యాయ సలహా కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని రంగసాయిరెడ్డి సూచించారు. ఉచిత న్యాయ సలహా కోసం 90594 48156 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

దేవాలయంలో చోరీ

కొమరోలు: స్థానిక దేవాలయంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో హుండీని గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లినట్లు దేవాలయ పూజారి సదాశివయ్య తెలిపారు. దేవుడి హుండీ దేవాలయం బయటే ఉండటంతో ఈ సంఘటన చోటుచేసుకుంది. పూజారి సదాశివయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై సుబ్బరాజు తెలిపారు. హుండీలో వెయ్యి రూపాయల నగదు ఉండవచ్చని తెలిపారు.

ఎయిడ్స్‌ నిర్మూలనకు చర్యలు

- ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి
- కలెక్టర్‌తో కలిసి అవగాహన ర్యాలీ ప్రారంభం

ఒంగోలు టౌన్‌: ఎయిడ్స్‌ మహమ్మారిని పూర్తిగా తరిమికొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటోందని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్‌ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌ నుంచి జీజీహెచ్‌ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌తో కలిసి ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాగుంట మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న అనేక కట్టడి చర్యల వలన ఎయిడ్స్‌, హెచ్‌ఐవీల విస్తరణ చాలా వరకు తగ్గిందని చెప్పారు. జిల్లాలో సాధారణ ప్రజల్లో 0.06 శాతం, గర్భిణుల్లో 0.01 శాతానికి గణనీయంగా తగ్గిందని వెల్లడించారు. హెచ్‌ఐవీ ప్రబలకుండా ప్రభుత్వం తీసుకున్న లెట్‌ కమ్యూనిటీ లీడ్‌ కార్యక్రమాన్ని అధికారులు విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రజలను భాగస్వాములను చేయడం ద్వారా హెచ్‌ఐవీ పూర్తిగా కనుమరుగవుతుందన్న విశ్వాసం ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే ఎయిడ్స్‌, హెచ్‌ఐవీకి కారణాలు, నివారణపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో రాణించేందుకు కృషి చేయాలని, క్రమం తప్పకుండా వ్యాయమం చేస్తూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు. సానుకూల ఆలోచనలతో అన్ని రంగాల్లో రాణించవచ్చన్నారు. హెచ్‌ఐవీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెడు వ్యసనాల బారినపడి జీవితాలను నాశనం చేసుకోకుండా జాగ్రత పడాలని సూచించారు. కలెక్టర్‌ దినేష్‌కుమార్‌ మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధితులను ప్రభుత్వం అనేక రకాలుగా ఆదుకుంటోందని చెప్పారు. హెచ్‌ఐవీ బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు తాను ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంటానన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్‌ ఎస్‌.రాజ్యలక్ష్మి, జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్‌ అధికారి డాక్టర్‌ సురేష్‌కుమార్‌, అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, కలెక్టర్‌ దినేష్‌కుమార్‌, తదితరులు

ఎయిడ్స్‌ బాధితులకు అండగా ఉంటాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ దినేష్‌కుమార్‌

- కలెక్టర్‌ దినేష్‌కుమార్‌

ఒంగోలు అర్బన్‌: ఎయిడ్స్‌ బారిన పడిన వారి కుటుంబానికి ప్రభుత్వ పరంగా, వ్యక్తిగతంగా కూడా అండగా ఉంటామని కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌ తెలిపారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్‌ డే సందర్భంగా స్థానిక ప్రకాశం భవనంలోని స్పందన హాలులో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ అవగాహనతో ఎయిడ్స్‌ను నిర్మూలిద్దామన్నారు. ఎయిడ్స్‌ ఏ విధంగా వ్యాప్తి చెందుతుందో వివరించారు. ఎయిడ్స్‌ నిర్ధారణ అయిన వారు మానసికంగా కుంగిపోవాల్సిన అవసరం లేదన్నారు. వైద్యుల సూచనల మేరకు పౌష్టికాహారం, మందులు క్రమం తప్పకుండా తీసుకుంటే జీవితకాలాన్ని పెంచుకోవచ్చన్నారు. అందుకు అవసరమైన మందులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఏఆర్‌టీ మందులు వాడుతున్న 2,168 మందికి ప్రభుత్వం పెన్షన్‌లు ఇస్తున్నట్లు వివరించారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో బాధితులకు అవసరమైన ఆహార పదార్థాలు, ఇతర వస్తువులను అందిస్తున్నట్లు వివరించారు. బాధితుల వివరాలను స్వచ్ఛంద సంస్థలు తన దృష్టికి తీసుకొస్తే వారికి అవసరమైన సహాయం వ్యక్తిగతంగా కూడా చేస్తానని కలెక్టర్‌ హామీ ఇచ్చారు. స్వయం ఉపాధికి అవసరమైన శిక్షణ, పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమయ్యే శిక్షణ కూడా బాధితులకు ఇప్పిస్తామన్నారు. బాధితుల పట్ల ఎవరూ వివక్ష చూపకూడదన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి కె.శ్యాంబాబు మాట్లాడుతూ ఎయిడ్స్‌ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక చట్టాలున్నాయన్నారు. ఈ చట్టాల ప్రకారం బాధితులపై అవమానకరంగా ప్రవర్తించడం, హక్కుల పట్ల నిర్లక్ష్యం వహించడం నేరమని తెలిపారు. ఈ సందర్భంగా గుంటూరు చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ సహకారంతో 300 మంది బాధితులకు అవసరమైన దుస్తులు, దుప్పట్లు, పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిత్యావసరాలు, ఇతర వస్తువులు పంపిణీ చేశారు. లయన్స్‌ క్లబ్‌ సహకారంతో సైకిల్‌, కుట్టుమిషన్‌ అందించారు. ఎయిడ్స్‌ సంబంధిత అంశాలపై విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన 20 మందికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం బాధితులతో కలిసి కలెక్టర్‌ భోజనం చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, టీబీ, ఎయిడ్స్‌ నివారణ అధికారి సురేష్‌కుమార్‌, డీఐఓ పద్మజ, జిల్లా మలేరియా నివారణ అధికారి జ్ఞానశ్రీ, డీపీఎం వాణిశ్రీ, టీబీ డీపీసీ రత్నకుమారి, అసిస్టెంట్‌ ఫుడ్‌ కంట్రోలర్‌ ప్రభాకర్‌, తదితరులు పాల్గొన్నారు.



మహిళకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌ అందిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్‌

మాది అభివృద్ధి, సంక్షేమ ప్రభుత్వం

- విజయవంతంగా నడిపిస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి
- రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్‌ ఆదిమూలపు సురేష్‌
- గొల్లపల్లిలో వై ఏపీ నీడ్స్‌ జగన్‌, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

త్రిపురాంతకం: తమది అభివృద్ధి, సంక్షేమ ప్రభుత్వమని, ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్విజయంగా ముందుకు నడిపిస్తున్నారని రాష్ట్ర మున్సిపల్‌, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్‌ ఆదిమూలపు సురేష్‌ పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలం గొల్లపల్లిలో వై ఏపీ నీడ్స్‌ జగన్‌, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ ఫలాలను రాజకీయాలకు అతీతంగా అందిస్తోందన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించిన ఘనత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వానిదన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రారంభించిన సంక్షేమ పథకాలతో మధ్యవర్తి ప్రమేయం లేకుండా లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా నగదు జమచేసినట్లు చెప్పారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వమని అన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన కలిసి పనిచేస్తూ తెలంగాణలో ఒకరు కాంగ్రెస్‌తో, మరొకరు బీజేపీతో పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు. వీరికి సంక్షేమం, అభివృద్ధి కనిపించదని అన్నారు. ప్రజలకు అందించిన సంక్షేమ ఫలాలను మంత్రి సురేష్‌ వివరించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ వి.కిరణ్‌, ఎంపీడీఓ సాంబశివరావు, ఏఓ కె.నీరజ, ఏఈ వెంకటేశ్వరరావు, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, బీసీ సెల్‌ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య యాదవ్‌, గ్రామసర్పంచ్‌ వెంకట తిరుమలయ్య, ఎంపీటీసీ ఏసేబు, పార్టీ కన్వీనర్‌ ఎస్‌.పోలిరెడ్డి, గ్రామ సచివాలయ కన్వీనర్‌ యల్లారెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్‌ గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌ సీపీ నాయకులు రాజయ్య, గురవయ్య, ఎస్‌.రంగబాబు, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- కలెక్టర్‌ దినేష్‌కుమార్‌

ఒంగోలు అర్బన్‌: మిచౌంగ్‌ తుఫాన్‌ ప్రభావం జిల్లాపై ఉంటుందనే ప్రాథమిక అంచనా మేరకు ఎటువంటి పరిస్థితులు ఏర్పడినా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌ ఆదేశించారు. శుక్రవారం సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. వ్యవసాయ, ఉద్యానవనశాఖల అధికారులు తుఫాన్‌ గురించి రైతులకు తెలియచేసి పంటలను జాగ్రత్త చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జాలర్లు చేపల వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులకు సూచించారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నపిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తీర ప్రాంత గ్రామాల్లోని తుఫాన్‌ షెల్టర్లను నిర్వహణలోకి తీసుకొచ్చేలా శనివారం నుంచి చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ, మండల స్థాయిలోని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ప్రాణ, ఆస్తి, పంట నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ ఆదేశించారు. విద్యుత్‌, రవాణా వ్యవస్థకు ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రం, మండల కేంద్రాల్లో కమాండ్‌ కంట్రోల్‌ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కమ్యూనికేషన్‌ వ్యవస్థకు అంతరాయం లేకుండా నెట్‌వర్క్‌ ఆపరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేయాలన్నారు. ఉద్యోగులకు సెలవులు మంజూరు చేయకుండా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో 1077 కాల్‌ సెంటర్‌ను నేటి నుంచి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి తుఫాన్‌ పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ శ్రీనివాసులు, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హెల్త్‌ సూపర్‌వైజర్‌ హఠాన్మరణం

- ఎయిడ్స్‌ అవగాహన ర్యాలీలో పాల్గొన్న పది నిముషాలకే గుండెపోటు



ఎయిడ్స్‌ ర్యాలీలో పాల్గొన్న శ్రీనివాసరెడ్డి

పొదిలి: వైద్యారోగ్య శాఖలో హెల్త్‌ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న నారు శ్రీనివాసరెడ్డి (54) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. శుక్రవారం ఎయిడ్స్‌ నివారణ దినం సందర్భంగా స్థానిక పెద్ద బస్టాండ్‌ సెంటర్‌లో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆ తర్వాత పది నిముషాల వ్యవధిలోనే ఒంట్లో నలతగా ఉందని పక్కనే ఉన్న సామాజిక వైద్యశాలకు వెళ్లారు. అక్కడి వైద్యులు ఈసీజీ తీశారు. వెంటనే ఒంగోలు వెళ్లాలని సూచించారు. అప్పటికే తీవ్ర గుండెపోటు రావడంతో శ్రీనివాసరెడ్డి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ప్రైవేటు వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీనివాసరెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామం మార్కాపురం మండలం గజ్జలకొండకు తరలించారు.

హెల్త్‌ శీనుగా తాలూకాలో పరిచయం...

శ్రీనివాసరెడ్డి అనే కంటే హెల్త్‌ శీను అంటే పొదిలి తాలూకాలోని మూడు మండలాల్లో చాలా మందికి పరిచయం. అందరినీ ఆప్యాయంగా పలకరించడం, వృత్తిపరంగా తనకు చేతనైనంత మేర రోగులకు ఆసరాగా ఉండటంతో శ్రీనివాసరెడ్డికి మంచి పేరు వచ్చింది. పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి పీహెచ్‌సీలలో పనిచేస్తుండటం, పొదిలి పట్టణంలో నివాసం ఉండటంతో తాలూకాతో పాటు పట్టణంలో చాలా మందికి శ్రీనివాసరెడ్డితో పరిచయం ఉంది. పొదిలి తాలూకా ఎన్‌జీఓ సంఘం అధ్యక్షునిగా సుమారు 20 సంవత్సరాల పాటు ఆయన పనిచేశారు. ప్రస్తుతం కూడా అధ్యక్షునిగా ఉన్నారు. శ్రీనివాసరెడ్డి మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టండి

- ఆర్టీఓ అమర్‌నాయక్‌

మార్కాపురం: డ్రైవర్లు రోడ్డు ప్రమాదాల నివారణకు తమవంతు బాధ్యతగా ట్రాఫిక్‌ రూల్స్‌ పాటిస్తూ వాహనాలు నడపాలని మార్కాపురం ప్రాంతీయ రవాణా అధికారి అమర్‌నాయక్‌ సూచించారు. శుక్రవారం ఆటో, కారు, లారీ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిసెంబర్‌ నుంచి ఫిబ్రవరి వరకూ మంచు ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ఉదయం 9 గంటల వరకూ వాహనాలు జాగ్రత్తగా నడపాలని తెలిపారు. మంచు ఎక్కువగా ఉంటే వాహనాన్ని ఆపి మంచు తగ్గిన తర్వాతే ప్రయాణాన్ని కొనసాగించాలని చెప్పారు. డ్రైవరు మద్యం, మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడిపితే కచ్చితంగా ప్రమాదం జరుగుతుందని, దీనివలన రెండువైపులా ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విలువైన జీవితం, కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వాహనాలు నడపాలన్నారు. కారు ప్రయాణికులు సీటుబెల్టు కచ్చితంగా ధరించాలన్నారు. మోటారు వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌ మాధవరావు మాట్లాడుతూ టూ వీలర్స్‌ నడిపేవారు కచ్చితంగా హెల్మెట్‌ పెట్టుకోవాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, స్పీడ్‌గా వెళ్లవద్దని సూచించారు. వాహనానికి కచ్చితంగా ఇన్సూరెన్స్‌ చేయించాలని సూచించారు.



అవగాహన కల్పిస్తున్న ఆర్టీఓ అమర్‌నాయక్‌

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయించండి

- సబ్‌ కలెక్టర్‌ సేథుమాధవన్‌

మార్కాపురం రూరల్‌: మార్కాపురం డివిజన్‌లో గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారుల వద్దకు వెళ్లి త్వరగా పూర్తయ్యేలా చూడాలని సబ్‌ కలెక్టర్‌ సేథుమాధవన్‌ సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక డ్వాక్రా బజారులో ఇంజినీరింగ్‌ అసిస్టెంట్లతో గృహ నిర్మాణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్‌ 1 నుంచి జనవరి 31వ తేదీ వరకూ ప్రతిరోజూ ఇళ్లను సందర్శిస్తూ లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. నిర్మాణానికి అవసరమయ్యే రుణాలను ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు అందించేందుకు సహకరించాలన్నారు. నాణ్యత విషయంలో రాజీపడవద్దని ఆర్‌సీఎల్‌, బీఎల్‌, ఎల్‌ఎల్‌ గృహాలు వందశాతం పూర్తిచేయడానికి ప్రత్యేక కార్యాచరణ, రోడ్డు మ్యాప్‌ సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ పవన్‌కుమార్‌, డీఎల్‌డీఓ సాయికుమార్‌, ఎంపీడీసీ చందన, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్‌ కలెక్టర్‌ సేథుమాధవన్‌

సేంద్రియ వ్యవసాయ ప్రాముఖ్యతను తెలుసుకోవాలి

ఒంగోలు సెంట్రల్‌: యువత సేంద్రియ వ్యవసాయ ప్రాముఖ్యతను తెలుసుకోవాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్‌ అన్నపూర్ణ అన్నారు. ఆత్మ కార్యాలయం ఆవరణలో శుక్రవారం స్కిల్‌ ట్రెనింగ్‌ రూరల్‌ యూత్‌ (ఎస్టీఆర్‌ వై) కార్యక్రమం నాల్గవ రోజు నిర్వహించారు. ఆత్మ పీడీ అన్నపూర్ణ మాట్లాడుతూ వ్యవసాయ పంటల్లో, ఉద్యాన వన పంటల్లో, పశు పోషణలో సైతం సేంద్రియ ఎరువులు వాడిన వాటి పరిస్థితి ప్రత్యేకంగా ఉంటుందని అన్నారు. జీవన ఎరువులు వాడిన వాటికి, రసాయన ఎరువుల వాడిన వాటికి భేదాలను వివరించారు. పశు సంవర్ధక శాఖ డీడీఏ సోమయ్య, దర్శి హెచ్‌ఆర్‌ఎస్‌ హెడ్‌ ధనుంజయ రావు, జీవ శాఖ ఏఓ గోపీచంద్‌, ఎస్‌ఎస్‌ఎఫ్‌ మహేష్‌, డీఆర్‌సీ ఏఓలు శైలజరాణి, శేషమ్మ పలు విభాగాల్లో సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యత, పనిచేసే విధానాలను వివరించారు.



శిక్షణలో వివరిస్తున్న ఆత్మ పీడి అన్నపూర్ణ

రిమ్స్‌ ఆస్పత్రి అభివృద్ధికి తక్షణ చర్యలు

- జీజీహెచ్‌లో కలెక్టర్‌ దినేష్‌కుమార్‌ తనిఖీ


ఒంగోలు టౌన్‌: రిమ్స్‌ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం రాత్రి బాగా పొద్దుపోయే దాకా జరిగింది. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, జిల్లా వైద్యారోగ్య శాఖకు చెందిన అధికారులు, రిమ్స్‌ హాస్పిటల్‌కు చెందిన వివిధ విభాగాల హెచ్‌ఓడీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. నిరుపేద సామాన్య ప్రజలకు ఆరోగ్యాన్ని అందజేస్తున్న జీజీహెచ్‌ అభివృద్ధి కోసం తగిన చర్యలు తీసుకోవాలని బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఈ క్రమంలో హాస్పిటల్‌ అభివృద్ధి కమిటీ చైర్మన్‌ అయిన కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌ కుమార్‌ శుక్రవారం జీజీహెచ్‌లో ఆకస్మికంగా పర్యటించారు. సమాచారం తెలిసిన వెంటనే మునిసిపల్‌, ఏపీఎస్‌ఐడీసీ, జీజీహెచ్‌, మెడికల్‌ కాలేజీ అధికారులు అక్కడికి చేరుకున్నారు. అధికారులతో కలిసి జీజీహెచ్‌లోని పలు విభాగాలను ఆయన పరిశీలించారు. అభివృద్ధి కమిటీ సమావేశంలో ఫార్మసీ కోసం ఇంటిగ్రేటెడ్‌ స్టోరేజ్‌ స్పేస్‌ కావాలని అధికారులు చెప్పడం తెలిసిందే. ఈ క్రమంలో జీజీహెచ్‌ అధికారుల విజ్ఞప్తి మేరకు పాత క్యాంటీన్‌ భవనాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోవిడ్‌ సమయంలో నిర్మించిన తాత్కాలిక వైద్యశాల క్యాబిన్‌ను పరిశీలించి, వాటిని నర్సింగ్‌ విద్యార్థులకు ఉపయోగించుకునే అంశం మీద ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు ఆదేశించారు. డంపింగ్‌ యార్డు నిర్వహణ కోసం ప్రత్యామ్నాయ స్థలాన్ని సూచించాలని ఏపీఎంఎస్‌ఐడీసీ ఈఈ విజయభాస్కర్‌ను ఆదేశించారు. పబ్లిక్‌ బాత్‌రూంలు, టాయిలెట్స్‌కు సంబంధించి ప్రతిపాదనలకు అనుగుణంగా నిర్మాణం చేపట్టేలా కేపీసీ నిర్మాణ సంస్థకు ఆదేశాలు ఇవ్వాలని ఏపీఎంఎస్‌ఐడీసీ ఈఈకి సూచించారు. ప్లే ఏరియా లెవెలింగ్‌ పనులకు సంబంధించి ఏర్పాటు చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్‌ ఎం.వెంకటేశ్వరరావును ఆదేశించారు. కలెక్టర్‌ వెంట సూపరింటెండెంట్‌ డా.భగవాన్‌ నాయక్‌, ప్రిన్సిపాల్‌ డా.ఏడుకొండలు, ఆర్‌ఎంఓ డా.తిరుమలరావు, నగర పాలక సంస్థ కమిషనర్‌ ఎం. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రిమ్స్‌ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ దినేష్‌ కుమార్‌

నేటి నుంచి జిల్లాలో ఏపీ ఎస్టీ కమిషన్‌ చైర్మన్‌ పర్యటన

ఒంగోలు సెంట్రల్‌: ఆంధ్రప్రదేశ్‌ ఎస్టీ కమిషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ డీవీజీ శంకరరావు నేటి నుంచి నాలుగు రోజుల పాటు జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి జగన్నాథరావు తెలిపారు. 5వ తేదీ వరకు మార్కాపురం, దోర్నాల, యర్రగొండపాలెం మండలాల్లోని గిరిజన ప్రాంతాల్లో పర్యటించి వారి జీవన స్థితిగతులు, అభివృద్ధికి అవలంబిస్తున్న పద్ధతులను తెలుసుకోనున్నట్లు చెప్పారు. 4వ తేదీ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు మార్కాపురం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో చైర్మన్‌ అందుబాటులో ఉంటారని చెప్పారు. గిరిజనులు, గిరిజన సంఘాల నాయకులు హాజరై సమస్యలు తెలియజేయాలని సూచించారు.



వివరాలు వెల్లడిస్తున్న జగన్నాథరావు

మోపాడు ఆయకట్టుకు నీరు విడుదల

పామూరు: మండలంలోని మోపాడు రిజర్వాయర్‌ పరిధిలోని పామూరు, నెల్లూరు జిల్లా కొండాపురం మండలాల్లో రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకునేందుకు శుక్రవారం ఇరిగేషన్‌ ఏఈఈ శ్రీనివాసులు, సిబ్బంది నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఈఈ మాట్లాడుతూ పామూరు, కొండాపురం మండలాల్లో ఆయకట్టులోని సుమారు 12 వేల ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగుచేసుకునేందుకు జిల్లా అధికారుల ఆదేశాలతో 4 నెలల పాటు నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. రైతులు పంటల సాగుకు నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నీరు విడుదల చేస్తున్న ఏఈఈ, సిబ్బంది

రేపు ఎన్‌ఎంఎంఎస్‌ పరీక్ష

ఒంగోలు: నేషనల్‌ మీన్స్‌ కం మెరిట్‌ స్కాలర్‌షిప్‌ పరీక్ష ఈనెల 3న జిల్లాలోని 19 సెంటర్లలో నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్‌ ఉన్నత పాఠశాల ఆవరణలో చీఫ్‌ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్‌ ఆఫీసర్లతో డీఈవో వీఎస్‌ సుబ్బారావు సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మొత్తం 19 సెంటర్లకు 19 మంది డిపార్టుమెంటల్‌ ఆఫీసర్లు, 19 మంది చీఫ్‌ సూపరింటెండెంట్లను నియమించామన్నారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని, మొత్తం 3826 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఎటువంటి ఎలక్ట్రానిక్‌ పరికరాలు పరీక్ష కేంద్రంలోనికి అనుమతించరని, ఎవరికైనా హాల్‌ టికెట్‌ రాకపోతే వారు ముందుగానే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

APS RTC
టెండరు ప్రకటన
నెం. E1/122(01)/2023/NLR Zone. తేది: 01-12-2023

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ Join BPT (Doctor), B.Sc. MLT (Lab Tech.) Courses in Vijayawada - Affiliated to Dr. YSR Health University - Clinical Training In GGH, VJA. Ph : 88866 54339, 78930 47556 [V- 2276]

COACHING

■ మార్టూరు శ్రీశారదానికేతన్‌ పబ్లిక్‌ స్కూల్‌ (CBSE) నందు ఉచితంగా NEET, JEE, EAPCET కోచింగ్‌ ఇవ్వబడును. వివరాలకు. ✆ 8500144199 [O-787248]

సెంట్రల్‌ పోలీస్‌ (SSC-GD)

■ యువతీ, యువకులకు 26,146 CRPF, CISF, BSF, ITBP, SSB కానిస్టేబుల్‌ ఉద్యోగాలు కలవు. అ:10thపాస్‌, వ:18-28 (20సం॥ అనుభవం-గత ఫలితాలు గల సంస్థ) స్టార్‌ డిఫెన్స్‌ అకాడమి, నంద్యాల, సెల్‌: 8790844959. [L-806252]

SSC(GD), రైల్వే, ఆర్మీ, ఉద్యోగాలు

■ 10thపాస్‌తో CRPF, CISF, BSF ఉద్యోగాలు, రైల్వే గ్రూప్‌-డి, రైల్వే పోలీస్‌ RPF, ఆర్మీ ఉద్యోగాలకు జాబ్‌ గ్యారెంటీతో శిక్షణ. స్వల్ప ఫీజు, ఉచిత బుక్స్‌, హాస్టల్‌, గ్రౌండ్‌. సిద్ధార్థ అకాడమీ, నంద్యాల. 90103 63553 [L-781168]

Real Estate

FOR RENT

■ ఆటోమొబైల్‌ షోరూమ్‌ అద్దెకు ఇవ్వబడును ఒంగోలులోని మంచి సెంటర్‌లోగల 4000SFT (Showroom) (40 గదులు) షోరూమ్‌ & సర్వీస్‌ Workshop అద్దెకు కలదు. ✆ 94937 19128 [O-191972]

Services

■ వ్యవసాయ భూములకు, రైతులకు, ఇండస్ట్రీలకు, వ్యాపారస్తులకు, పర్సనల్స్‌కు తక్కువ వడ్డీకి సహాయం చేయబడును. సంప్రదించండి: Ph : 7997441253 [H-788227]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి, ఈ రోజు మార్కెట్‌ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్‌ క్యాష్‌) సం॥ ✆ 96590 57777. [O-191985]

Wanted

■ ప్రకాశం జిల్లా, ఒంగోలులో ప్రముఖ రియల్‌ ఎస్టేట్‌ నందు పనిచేయుటకు మార్కెటింగ్‌ ఏజెంట్స్‌ కావలెను. సంప్రదించండి. ✆ 9866148820, 9440842447. [O-192025]

■ ఒంగోలు, భాగ్యనగర్‌లో గల అతిపెద్ద Super Dry నందు పనిచేయుటకు డెలివరీ బాయ్స్‌ 1 (లోకల్‌), రిసెప్షనిస్ట్‌-1 Q డిగ్రీ + కంప్యూటర్‌ నాలెడ్జ్‌, షాప్‌గర్ల్స్‌-2 (Q 10th) ✆ 91540 09999. [O-191987]

■ రాయల్‌ మల్టీస్పెషాలిటి హాస్పిటల్‌ సుందరయ్య భవన్‌రోడ్‌, ఒంగోలు నందు పని చేయుటకు ఆపరేషన్‌ థియేటర్‌ సిస్టర్స్‌, రిసెప్షనిస్ట్‌, వాచ్‌మెన్‌, PRO కావలెను. సం॥ ✆ 9618800333, 9618460006. [O-759035]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్‌ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్‌ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221881]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌ టైమ్‌ / ఫుల్‌ టైమ్‌ గా వర్క్‌ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221928]

■ హరేకృష్ణ హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం జీ: 18K ఫోన్‌: 9640258899/ 9640468899 [H-793657]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వివరాలకు సంప్రదించండి:
క్లాసిఫైడ్స్‌ :
ఒంగోలు
90102 02856
90102 02762